





# నవభూమి నిజామాబాద్

అనుబంధం

07 సెప్టెంబర్,2024 శనివారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## యూనివర్సిటీలను కేసీఆర్ ప్రభుత్వం
# గాలి కొదిలేసింది

**హైదరాబాద్:** గత పది సంవత్సరాలుగా తెలంగాణలో ఉన్న యూనివర్సిటీలను కేసీఆర్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపణలు చేశారు. ఈరోజు(గురువారం) రవీంద్ర భారతిలో గురుపూజోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 27, 862 విద్యాలయాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తును అందిస్తోందని చెప్పారు. విద్యా సంస్థలకు ఉచితంగా ఇచ్చే విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ శాఖకు చెల్లిస్తోందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విద్యతో పాటు గురువులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గత దశాబ్ద కాలంగా ఈ రాష్ట్రంలో డీఎస్సీని నిర్వహించలేదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11, 062 పోస్టులకు నోటిఫికేషన్ వేయడంతో పాటు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 6వేల పైబడి పోస్టులకు నోటిఫికేషన్ వేయడానికి భవిష్యత్తు ప్రణాళికను తయారుచేసి ముందుకు పోతున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులు పదోన్నతికి, బదిలీలకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 45 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేశామని గుర్తుచేశారు. 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యా విధానం మారాలని పాఠశాలల్లో వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు వేసి వాటి నిర్వహణ స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించి ప్రభుత్వం 667 కోట్ల రూపాయలను వెచ్చించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు లేకపోవడం వల్ల గురువులే పాఠశాలను శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి ఉండేదని అన్నారు. గత పాలనలో ఈ పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ పరిస్థితి పోవాలని ఈ ఆర్థిక సంవత్సరం శానిటేషన్ వర్క్స్ ఏర్పాటుకు 136 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పటివరకు పరిశ్రమలకు పనికి వచ్చే సిలబస్ అందుబాటులో లేకపోవడం వల్ల పరిశ్రమలు అభివృద్ధి కూడా వెనకడుగు పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పడానికి సంతోషిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో 63 ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్?గా ఏర్పాటు చేసి ఆధునాతన



సాంకేతిక విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పన కోసం ఈ ఆర్థిక సంవత్సరం 300 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసిన ఉస్మానియా యూనివర్సిటీకి 100 కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో గురువులకు ఉపపయోగపడే మంచి ఆలోచనలు కచ్చితంగా తీసుకుంటామని అన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి చర్చించిన తర్వాతే విధానపరమైన నిర్ణయాలు తయారు చేస్తామని భట్టి విక్రమార్క వివరించారు.

ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ నిర్మాణం కావడానికి గురువుల పాత్ర కీలకంగా ఉపయోగపడాలని సూచించారు. విద్యా బుద్ధులతో పాటు మంచి అలవాట్లు, సంస్కారం నేర్పించిన మానవ వనరులు సమాజంలో ఉన్న చాలా రుగ్మతలను ఎదుర్కొని సమాజానికి ఉపయోగపడతారని అన్నారు. సమాజం మనుగడ కోసం పునాదులు వేయాల్సింది గురువులేనని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007 సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో తెలుగు మీడియంతో పాటు ఆంగ్ల మీడియం చెప్పాలని ఆనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రోత్సహించి ఉపాధ్యాయు విద్యార్థులు రాణిస్తున్నారని భట్టి విక్రమార్క వెల్లడించారు. సమాజ నిర్మాణంలో ప్రపంచంతో పోటీపడే విధంగా మానవ వనరులను తయారు చేయడానికి ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాలను అమలు చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. అభ్యుదయ భావాలతో గురువులు ఉండటం వల్ల ఆ స్ఫూర్తితో ఈ రాష్ట్రం ప్రగతిశీలంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చాలామంది గురువులు గొప్ప వాళ్లు ఉండటం, ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగి ఉన్నందుకు సంతోషంగా గర్విస్తున్నానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు

## నేటి నుంచి
# ఈ రూట్‌లో వెళ్తున్నారా

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

వినాయక చవితి వచ్చేసింది.. హైదరాబాద్‌లో బడా గణేశుడు కొలువుదీరాడు. తొమ్మిది రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే వేల సంఖ్యలో వినాయక మండపాలు వెలిశాయి. ప్రధాన వీధుల్లో తప్పకుండా ఓ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పోలీసులు భద్రతా పరమైన చర్యలు చేపడుతున్నారు. వినాయక చవితి వచ్చిందంటే చాలు.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య వాహనదారులను తెగ ఇబ్బంది పెడుతోంది. దీంతో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులుల తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పలు మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. సెప్టెంబర్7వ తేదీ నుంచి ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తయ్యే 17వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం తెలిపింది. ఈపది రోజులు ఉదయం 11 గంటల వరకు అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అందుబాటులో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా..**

ఖైరతాబాద్ విశ్వేశ్వరాయ విగ్రహం నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం మీదుగా మింట్ కాంపౌండ్ వైపు సాధారణ ట్రాఫిక్‌ను అనమతించరు. రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి నిరంకారి జంక్షన్ వైపు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సైఫాబాద్ పాత పోలీస్ నుంచి ఖైరతాబాద్ బడా గణేష్ వైపు రాజ్ దూత్ లేన్‌లోకి సాధారణ ట్రాపిక్‌ను అనుమతించరని, ఇక్బాల్ మినార్ వైపు వాహనాలను అనుమతించరు. సాధారణ వాహనాలను ఇక్బాల్ మినార్ నుంచి మింట్ కాంపౌండ్ లేన్ వైపు అనుమతించరు. మింట్ కాంపౌండ్ లేన్ ఎంట్రన్స్ నుంచి వాహనాలను తెలుగు తల్లి జంక్షన్ వైపు మళ్లిస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఎన్టీఆర్ మార్గ్/ఖైరతాబాద్ ఫ్లైఓవర్/ నెక్లెస్ రోడ్ నుంచి మింట్




కాంపౌండ్ వైపు సాధారణ ట్రాఫిక్‌ను అనుమతించరు. నెక్లెస్ రోడ్‌లో రోటరీ నుంచి తెలుగు తల్లి జంక్షన్ వైపు, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు. నిరంకారి నుంచి సాధారణ ట్రాఫిక్‌ను ఖైరతాబాద్ పోస్టాఫీసు లేన్, ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు అనుమతించరు. పోస్టాఫీసు వద్ద ఓల్డ్ సైఫాబాద్ జంక్షన్ వైపు కూడా వాహనాలను అనుమతించరు

**సెలవు రోజుల్లో..**

సాధారణ, వారాంతపు సెలవు రోజుల్లో ఖైరతాబాద్ బడా గేణేశుడి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఖైరతాబాద్, షాదన్ కాలేజ్, నిరంకారి, ఓల్డ్ సైఫాబాద్ పోలీస్ స్టేషన్, మింట్ కాంపౌండ్ ప్రాంతాలు రద్దీగా ఉంటాయని, సెలవు దినాల్లో ఈ మార్గాల్లోకి వావాహనదారులు రావొద్దని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

**పార్కింగ్ స్థలాలు ఇవే..**నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ గార్డెన్ మీదుగా బడా గణేష్ దర్శనానికి వచ్చే సందర్శకులు తమ వాహనాలను ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ పక్కన అంబేద్కర్ స్క్వేర్ పార్కింగ్ స్థలంలో, ఎన్టీఆర్ గార్డెన్ పార్కింగ్ ప్లేస్‌తో పాటు సరస్వతి విద్యా మందిర్ హైస్కూల్ ప్రాంగణం, రేస్ కోర్స్ రోడ్ పార్కింగ్ ప్లేస్‌లో వాహనాలను పార్క్ చేయాలని పోలీసులు సూచించారు. భక్తులు తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే సరిగ్గా పార్క్ చేయాలని పోలీసులు కోరుతున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా ఆలస్యాలను నివారించడానికి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని తెలిపారు. ప్రయాణ సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కు కాల్ చేయాల్సిందిగా తెలిపారు.

# హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే జైలే గతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:** హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడే వారిపై హైడ్రా చీఫ్ రంగనాథ్ సీరియస్ అయ్యారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలు జీవితం తప్పదంటూ వార్నింగ్ ఇచ్చారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేసిన బిల్డర్లను బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలంటూ రంగనాథ్ సూచించారు. అమీన్ పూర్‌లో వసూళ్లకు పాల్పడ్డ సామాజిక కార్యకర్త విప్లవ్ అరెస్ట్ అయ్యారు. .హైడ్రా విభాగాన్ని తప్పుదోవ పట్టించే విధంగా యత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ రంగనాథ్ హెచ్చరికలు జారీ చేశారు.ఏసీబీ డీజీ వార్న్ హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్న ఏసీబీ డీజీ కూడా హెచ్చరించారు. హైడ్రా పేరుతో కొందరు ప్రైవేటు , ప్రభుత్వ అధికారులు పాత నోటీసులు ఇస్తున్నారన్నారు. ఫిర్యాదులను సాకుగా చూపి ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేస్తుట్లు తమ నోటీసుకి వచ్చిందన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన హైడ్రా పేరును చూపిస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు.

# కాలుష్యం కోరల్లో కాగజ్‌నగర్

**ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి):** జిల్లా కార్మిక వర్గానికి వరప్రదాయినిగా చెబుతున్న సిర్పూరు పేపరు మిల్లు(ఎస్పీఎం) ఈ ప్రాంతం ప్రజానీకానికి పరోక్షంగా అనారోగ్యాన్ని ప్రసాదిస్తోంది. ఎస్పీఎం నుంచి వెలువడే విష వాయువులు, విషరసాయన జలాలతో ఇక్కడి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కాగితం తయారీలో యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాలపై పెట్టకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంతోపాటు పరిసరమండలాలు కాలష్యకోరల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో నిజాంకాలంలో ఏర్పాటు చేసిన సిర్పూరు కాగితపు పరిశ్రమ అనేక ఒడిదుడుగులను ఎదుర్కొంటూ ఇప్పటికే ముగ్గురు చేతులు మారింది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా 600మందిపైగా పరోక్షంగా పదివేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. బిర్లా కుటుంబం చేతిలో నష్టాలపాలై సెప్టెంబరు 27, 2014లో మూసివేసిన తర్వాత కార్మికుల ఆందోళనతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జేకేసంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక రాయితీలు ప్రకటించి ఆగస్టు 2, 2018లో పునరుద్ధరించింది. ఈ క్రమంలో పాతయంత్రాల స్థానంలో కొన్ని యంత్రాలను మార్చినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆధునీకరించలేదు. కాగా కాగితపుతయారీలో కీలకమైన గుజ్జుశుద్ధిచేసే క్రమంలో అధిక మోతాదులో రసాయనాలను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో చాలా మటుకు హానికరమైనవేనని చెబుతున్నారు. కాగా పల్ప్(కర్రను ద్రవపదార్థంగా మార్చే ప్రక్రియ) శుద్ధి చేసిన తర్వాత వదులుతున్న వ్యర్థజలాల్లో కూడా ఇంకా రసాయనిక ఆవశేషాలు మిగిలిఉండటం వల్ల ఆనీరు ప్రదేశం అంతా కాలుష్యంగా మారుతోంది. రసాయనాలతో ప్రవహించే నీటిని కాగజ్‌నగర్ పరిసరాల్లో చాలామంది రైతులు వరిసాగుకు వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్ప డింది. రసాయనిక వ్యర్థాలతో కూడిన నీటిని వాడి పంటలు పండించటం వల్ల ఆ ఉత్పత్తులను వినియోగించిన వారికి పలురకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

గాలి,నీరు విషతుల్యం.. ఎస్పీఎం ద్వారా విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా గాలి, నీరు విషతుల్యమవుతున్నాయి. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లే పొగతో పట్టణమంతా దుర్వాసన వస్తోంది. పట్టణంతోపాటు సమీప మండలాల్లో గాలిద్వారా విషవాయువులు వ్యాప్తిచెందడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా పొగగొట్టాల ద్వారా వెళ్లాల్సిన పొగ గాలిలో ఉన్న తేమ వల్ల కిందకు వచ్చి పట్టణమంతా వ్యాప్తిచెందుతోంది. దీంతో శ్వాస తీసుకునేందుకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పట్టణమంతా పొగతో కమ్మేస్తుండడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బం దులు పడుతున్నారు. అలాగే పెద్దవాగులో జలాలు కలుషితం అవుతుండడంతో పాటు ఈ వ్యర్థం ప్రవహించే పరివాహకం ప్రాంతంలోని కాలనీల్లో తీవ్ర దుర్గంధం




వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు ఈ వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పల్ప్ శుద్ధి తర్వాత విడుదల చేసే వ్యర్థ జలాలతో ఎలాంటి హానీ కారక రసాయాలు లేవని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ నీరు ప్రవహించిన పంట భూములన్నీ తెల్లబారిపోయి దిగుబడులు కూడా తగ్గుతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి విడులయ్యే ఈ వ్యర్థ జలాలు మసాలవాగులో కలిసి అక్కడినుంచి కిలోమీటరు దూరంలో ఉన్న పెద్దవాగులోకి కలుస్తుండడంతో పెద్దవాగు పరివాహక ప్రాంతంలో ఉన్న కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాల్లోని చాలా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభావితం అవుతున్నట్టు చెబుతున్నారు. కొంతకాలంగా ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే జలాలతో పెద్దవాగు నీరు కూడా దుర్వాసన వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ వాగు పరివాహక ప్రాంతంలోనే అరుదైన జంతువులు, పక్షులు మనుగడ సాగిస్తున్నాయి. ఫ్యాక్టరీవ్యర్థాలు పెద్దవాగులో కలువడం వల్ల వాగు పరివాహక ప్రాంతంలోని వణ్యప్రాణులు, పక్షులు, అరుదైన జలచరాలపై ప్రభావం పడుతోంది. ఈ భరించరాని వాసనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కాగితం తయారీలో వాడే రసాయనాల వల్ల రోగ నిరోధకశక్తి తగ్గిపోవడం, గుండె, ఊపిరితిత్తుల, కంటి సంబంధిత వ్యాధులు, శ్వాసనాళ సంబంధిత వ్యాధులు, దగ్గు, దమ్ము వంటి అనారోగ్యకరమైన దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయి.

దుర్గంధంతో ఇబ్బందులు.. అంబాల ఓదెలు, కాగజ్‌నగర్

ఎస్పీఎం నుంచి వెలువడే దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, రాత్రివేళల్లో దీని తీవ్రత అధికంగా ఉంటోది. మిల్లు పరిసరప్రాంతాల కాలనీవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పట్టణమంతా పొగతో కమ్మేస్తోంది. ఫ్యాక్టరీ వ్యర్థాలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కాగజ్‌నగర్‌తోపాటు సమీప మండలాల ప్రజలపై ప్రభావం పడుతోంది. కాలుష్య నియంత్రణ మండలి అ?ధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

## రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం: సిరిసిల్ల రాజయ్య



**సిర్పూర్ సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలంగాణ ఫైనాన్స్‌కమిషన్ చైర్మన్ సిరిసిల్లరాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని టోం కిని, పారిగాం, లక్ష్మీపూర్ గ్రామా ల్లో ఇటీవలకురిసిన భారీ వర్షా లకు ముంపునకు గురైన ప్రాం తాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రభు త్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిఏటా వర్షాకాలంలో ఇలాంటి పరిస్థి తులే తలెత్తుతున్నాయని ముంపునకుగురై ఏటా పంటలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనవెంట ఏవో మధులత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎమ్మార్వో శ్రీనివాస్ తదితరులున్నారు. ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘనస్వాగతం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శుక్రవారం కాగజ్‌నగర్‌కు రావటంతో స్థానికనాయకులు ఆయ నకు ఘనస్వాగతం పలికారు. ఎస్పీఎం గెస్ట్‌హౌజ్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీఇన్‌చార్జీ చైర్మన్లు కోనేరు కృష్ణారావు, సిడాం గణపతి, బసార్కర్ విశ్వనాథ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం మాజీఎమ్మెల్యే కోనప్ప నిర్వహిస్తున్న నిత్యాన్నాదానసత్రాన్ని పరిశీలించి భోజన వసతులు, ఇతర అంశా లపై అడిగి తెలుసుకున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్



**కాగజ్‌నగర్, సెప్టెంబరు 6:** కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా శ్రద్ధా శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ రెవెన్యూ డివిజన్‌అధికారిగా సురేష్ పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయాల్లో సబ్‌కలెక్టర్లకు పోస్టింగులిస్తూ ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికిచెందిన 2022ఐఎఎస్ బ్యాచ్‌కుచెందిన శ్రద్ధా శుక్లాకు తొలిపోస్టింగ్ కాగజ్‌నగర్ కేటాయించారు. కలెక్టర్‌ను కలిసిన సబ్‌కలెక్టర్ కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అంశాలపై వారు చర్చించారు.

## వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**ఆసిఫాబాద్,సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి):** జిల్లాలో వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా తొమ్మిదిరోజుల పాటు వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోనున్నారు. ఇందుకోసం నిర్వా హకులు వినాయక మండపాలను సిద్ధంచేశారు. జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని 14మండలాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండపాలను అన్నిహంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే వినాయక విగ్రహాలను పలు ప్రాంతాల నుంచి మండపాలకు చేరవేశారు. ఒకరికంటేఒకరు భారీ విగ్రహాలు నెలకొల్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నారు. పలు మండపాల నిర్వాహకులు లక్కీడ్రా ద్వారా కార్లు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఎల్ఈడీ టీవీలు తదితర ఆకర్షనీయమైన బహుమతులతో లక్కీడ్రాలను చేపడుతున్నారు. చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఆయా మండపాల వద్ద బందోబస్తు చేపట్టనున్నారు. నవరాత్రులు పూజలం దుకున్న అనంతరం వినాయక నిమజ్జనాన్ని చేపట్టనున్నారు.

# జైనూరులో కొనసాగుతున్న ఆంక్షలు

**ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి):** జైనూరు మండలంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు విధించిన ఆంక్షలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర అదనపు డీజీ మహేష్‌భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలు జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్‌మహాజన్, గౌస్ ఆలం, బాలా నగర్ డీసీపీ సురేష్‌కుమార్ జైనూరులోనే మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇరువర్గాల ఘర్షణలో సంభవించిన ఆస్తినష్టంపై అధికారులు నివేదికలను రుపొందించే పనిలోపడ్డారు. ఏమేరకు ఆస్తినష్టం సంభవించింది, ఎన్ని ఇండ్లు, దుకాణాలు దగ్ధం అయ్యాయి అని అంచనాలను రూపొందిస్తు న్నారు. ఇందుకోసం ప్రత్యేకాధికారిగా డీఎస్పీ కరుణా కర్‌ను నియమించారు. కొనసాగుతున్న 144 సెక్షన్.. జైనూరులో 144సెక్షన్ కొనసాగుతోంది. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసు ఉన్నతాధి కారులతో పాటు వెయ్యి మందికి పైగా స్పెషల్ పార్టీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీంలు బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి జైనూరు వైపు ఎవరినీ రాకుండా అడ్డుకుం టున్నారు. జైనూరు నుంచి ఆసిఫాబాద్ వైపు, జైనూరు నుంచి ఉట్నూర్ వైపు, జైనూరు నుంచి లింగాపూర్ వైపు పికెటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి కొత్త వ్యక్తులను ఎవరినీ అనుమతించడం లేదు. కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అత్యవసర పరిస్థితుల్లో



ఆసుపత్రులకు వెళ్లే వారిని మాత్రమే అనుమతిస్తున్నారు. ఆసిఫాబాద్ డీఎస్పీపై బదిలీ వేటు: జైనూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనలో ఆసిఫా బాద్ డీఎస్పీ సదయ్యపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ఈ మేరకు మల్టీజోన్-1ఐజీ పి చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో కాగజ్‌నగర్ డీఎస్పీగా పనిచేస్తున్న కరుణాకర్‌ను ఆసిఫాబాద్ డీఎస్పీగా నియమిం చారు. ఏజెన్సీ మండలాల్లో కొనసాగుతున్న బంద్.. జైనూరులో జరిగిన ఘటనతో జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రెండురోజులుగా బంద్ కొనసాగు తోంది. సిర్పూర్ (యు), లింగాపూర్, తిర్యాణి, కెరమెరి, వాంకిడి మండలాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. రెండు రోజులుగా బంద్‌తో ప్రజలు నిత్యావసర సరు కులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫా బాద్ డిపో నుంచి ఆదిలాబాద్‌వైపు ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రాంతా లకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా రు. ప్రయాణికులు మంచిర్యాల మీదుగా ఉట్నూర్, ఆదిలాబాద్‌కు ప్రయాణిస్తున్నారు. నిలిచిన ఇంటర్నెట్‌తో ఇక్కట్లు.. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీసేవా కేం ద్రాలు, ఏటీఎంలు, ఇతర ఇంటర్నెట్ ఆధారితసేవల్లో నడవడం లేదు. ఆన్‌లైన్ పేమెంట్‌లకు సైతం బ్రేక్ పడింది. నేటి నుంచి ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ శనివారం ఉదయం నుంచి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధ రించనున్నట్లు జిల్లా అధికార వర్గాలు వెల్లడిం చాయి. జైనూరుతోపాటు లింగాపూర్, తిర్యాణి, సిర్పూర్(యు), కెరమెరి, వాంకిడి మండలాల్లో ఇంటర్నెట్ సేవలు ఉండవని, మిగితా మండ లాల్లో మాత్రమే ఇంటర్నెట్ సేవలు అందు బాటులో ఉంటాయన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి



చెన్నూరు, సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి): గణపతి ఉత్సవాలను, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. సంతోషి మాత ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలకు తావివ్వకూడదన్నారు. చెరువు కట్ట వద్ద ఉన్న ఘాట్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐలు రవీందర్, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో గణపతి పండగను జరుపుకోవాలని సీఐ మోహన్ పేర్కొన్నారు. పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు. పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ సూచించారు. మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు పాల్గొన్నారు.
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి శ్రీరాంపూర్: గణేష్ మండపాల నిర్వాహకులు మండపం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. వారికి వచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను ప్రింట్ తీసి లామినేషన్ చేసుకోవాలని సూచించారు. పోలీసులకు క్యూ ఆర్ కోడ్‌ను చూపించాలని పేర్కొన్నారు. భీమిని: గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించు కోవాలని ఎస్సై విజయ్ కుమార్ సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ బికర్ణ దాస్, ఏఎస్సై తిరుపతి పాల్గొన్నారు. బెల్లంపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలను రోజు పరిశీలించాలని సూచించారు

# వరదపై రాజకీయాలు చేయొద్దు..

## ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు



మహబూబాబాద్ సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి):వరదపై రాజకీయాలు చేయకుండా తక్షణమే బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. వరద బాధితులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో ఈరోజు(శు క్రవారం)ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ.. పంట నష్టం అంచనా వేయడంలో అధికార యంత్రాంగం విఫలం అయిందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం విపత్తు నిధి కింద రూ. 1360 కోట్లు ఇచ్చిందని గుర్తుచేశా రు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఈటల రాజేందర్ కోరారు. రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చెరువుల ఆనకట్టలు తెగి చేపలు కొట్టుకుపోవడంతో మత్స్యకారులకు జీవనోపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో కొట్టుకుపోయిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# వర్షాలకు గూడ రాలుతోంది

మోత్కూరు,సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి): అదనుతప్పి కురుస్తున్న వర్షాలతో రైతన్న ఆగమవుతున్నాడు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యేది వరి, పత్తి పంటలే. ఈఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండున్నర మాసాలు గడిచాక,ఈ నెల లో కురిసిన వర్షాలు మినహా అంతకు ముందుకు భారీ వానలే లేవు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేయగా, జిల్లాల్లో ప్రధానంగా మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల తదిత ర మండల్లాలో నేటికీ చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. బిక్కేరువాగులో నూ నీరు ప్రవహించలేదు. జిల్లాలో చెప్పుకోదగిన ప్రాజెక్టులు లేకపోవడం తో వర్షాధారంపైనే పంటలు సాగవుతున్నాయి. మెట్టపంటలతోపాటు చెరువులు, కుంటలు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నా రు. నేటికీ చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు, బోర్లలో భూ గర్భ జలాలు పెరగలేదు. దీంతో వరినాట్లు వేయలేకపోవడంతో నార్లు ముదురుతున్నాయి. వచ్చిపోయే చినుకులకు మడులు తడిపి, దున్ని నాటువేసినా ఆ తర్వాత ఎండలకు ఎండిపోతున్నాయి. అదును ప్రకారం వర్షాలు లేక పత్తి, కంది చేలు కుంటుపడ్డాయి. ఈ వర్షాలు పత్తి చేలకు జీవం పోసినా, గూడ (మొగ్గ) రాలి నష్టాన్ని కలిగిస్తున్నాయి. గూడ రాలుతున్న పత్తి జిల్లాలో 1.04లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. జూలైలో భారీ వర్షాలు లేక, భూమి లోతుగా తడవక పత్తి చేలు వాడి అంతగా ఎదుగుదల లేదు. పత్తి మొలకెత్తిన మూడు మాసాల్లోనే పూర్తిగా ఎదగాలి. అప్పుడే సరైన దిగుబడి వస్తుంది. ఆగస్టులోనూ సరైన వర్షాలు లేక మరో సారి పత్తి చేలు వాడిపోయాయి. చేలు పూత, కాత దశలో ఉన్నాయి. ఆగస్టులో వర్షాలు లేక వాడిపోయిన చేలకు ఇటీవల కురిసిన వర్షాలు జీవం పోసినప్పటికీ గూడ (మొగ్గ) విపరీతంగా రాలిందని పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. గూడ రాలడంతో 15 నుంచి 20శాతం దిగుబడి తగ్గుతుందని, పత్తి చేలకు తెగుళ్లు కూడా సోకుతున్నాయి, మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటను దెబ్బతీస్తున్న గొట్టం రోగం జిల్లాలో ఇప్పటికీ వరినాట్లు 70శాతం కూడా పూర్తికాలేదు. రైతులు ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. వచ్చిపోయే



చినుకులకు రోజుకో మడి చొప్పున తడిపి, దున్ని నాటు వేయగా వర్షాలు లేక ఎండలు వచ్చినప్పుడు బావులు, బోర్ల నుంచి నీరు అందక వేసిన నాట్లు ఎండిపోతున్నాయి. ఎండిపోగా మిగిలిన వరి నాట్లకు కూడా గొట్టం రోగం సోకి వరి చేలు ఎర్రబారుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరి, మెట్ట పంటల సాగు ఏమాత్రం లాభసాటిగా లేదంటున్నారు. గూడ రాలిన పత్తి చేలకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**పంటలు దెబ్బతింటున్నాయి : మద్రి మధు, రైతు మోత్కూరు**

నాకున్న భూమితో పాటు ఇతరుల భూమి కౌలుకు తీసుకుని 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి చేలల్లో 20శాతం గూడ రాలింది. గతంలో నాన్ బీటీ పత్తి కావడంతో నెలల తరబడి దిగుబడి వచ్చేది. ఇప్పుడు బీటీ పత్తి కావడంతో మొదట మైల పత్తి ఏరిన తర్వాత మరో రెండు, మూడు సార్లు ఏరితే పత్తి దిగుబడి ముగుస్తుంది. ఈ వర్షాలకు గూడ రాలడంతో దిగుబడి 20శాతం తగ్గినట్లే. ఏడు ఎకరాలు వరి నాటు వేయగా, రెండు ఎకరాల నాటు ఎండింది. వర్షాకాలమే అయినా నీళ్లు అందక బావి మళ్లీ పూడిక తవ్విస్తున్నా. గూడ రాల్చిన పత్తి చేలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి

# జిల్లాలో ఐటీ కారిడార్

పెద్దపల్లి సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి): జిల్లాకు కొన్ని ఐటీ పరిశ్రమలను తీసుకవచ్చి కారిడార్‌ను ఏర్పాటుచేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆలోచన చేస్తున్నారు. ముందుగా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజవర్గాల్లో స్కిల్ డెవలప్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రామగుండంలో ఇటీవలనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి స్కిల్ డెవలప్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పెద్దపల్లి నియోజక వర్గంలోని సుల్తానాబాద్‌లో స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ శాఖాధికారులు స్థల సేకరణ చేస్తున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సైతం స్కిల్ డెవలప్ సెంటర్‌ను తమ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఇదివరకే మంత్రిని కోరారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్కిల్ డెవలప్ సెంటర్‌కు సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్‌లోగల సర్వే నంబర్ 228లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అలాగే పట్టణంలోని సర్వే నంబర్ 779, 229లో కూడా ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించారు. సుల్తానాబాద్ పట్టణం రాజీవ్ రహదారిని ఆనుకుని ఉంది. అలాగే పెద్దపల్లిలో రైల్వే జంక్షన్‌తో రైల్వే కనెక్టివిటీ, అటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రం సమీపంలోనే ఉండడంతో శాస్త్రీనగర్‌లోనే స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పది ఎకరాల స్థలం ఉండడంతో భవిష్యత్‌లో ఆ స్థలాన్ని ఐటీ కారిడార్‌కు ఉపయోగించుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆలోచన చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కావడంతో పలు ఐటీ కంపెనీలకు తీసుకవచ్చి స్థానికంగా ఉండే నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, దక్షిణ కొరియా, దావోస్‌లలో పర్యటించారు. రాష్ట్రంలో పలు ఐటీ, సంబంధిత కంపెనీలను ఏర్పాటుచేసేందుకు ఆయా సంస్థలకు ముందుకు వచ్చాయి. సుమారు 36వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి నిరుద్యోగులపై ఆర్థిక భారం.. జిల్లాలో అనేక మంది బీటెక్, డిగ్రీలు, పీజీలు చేసి చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ, ఇతర ఉద్యోగాల కోసం హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకోవాలంటే ఆర్థికభారం అవుతున్నది. దీంతో కొద్దిరోజుల పాటు శిక్షణ పొంది, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తిరిగి స్వగ్రామాలకు వస్తున్నారు. డిగ్రీలు పూర్తిచేసిన తర్వాత నైపుణ్య శిక్షణ ఇస్తే సులువుగా ఉద్యోగాలు సాధించే అవకాశాలుంటాయి. అందుకే జిల్లాలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కేంద్రాల ద్వారా ఐటీ, తదితర ఉద్యోగాలు పొందేందుకు కావాల్సిన శిక్షణతో స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. మంథనిలోనూ ఒక స్కిల్ డెవలప్ సెంటర్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో మంత్రి ఉన్నారు. ఇందుకు కావాల్సిన స్థల సేకరణ కోసం రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌లో 10 ఎకరాల స్థలాన్ని ఐటీ కారిడార్‌కు కలెక్టర్ కేటాయించారు. మరికొద్ది రోజుల్లో స్కిల్ డెవలప్ సెంటర్‌ను మంజూరు చేయనున్నారని ఎమ్మెల్యే విజయమరమణారావు పేర్కొన్నారు.

# ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

చెన్నూరు, సెప్టెంబర్ 6 (నవభూమి ప్రతినిధి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వం శీకృష్ణ అన్నారు. శు క్రవారం 5వ వార్డు గెర్రె కాలనీలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.31 కోట్లతో నిర్మిం చనున్న వాటర్ ట్యాంకు పనులను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. ఎంపీ మాట్లా డుతూ వాటర్ ట్యాంకు ద్వారా 2 వేల కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చి ఇంటింటికి తాగు నీరందిస్తామన్నారు. ట్యాంకు నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మె ల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ నాలుగు సంవత్స రాల్లో నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం ఫెయి ల్యూర్ అయ్యిందన్నారు. మిషన్ భగీరథ పథకంలో రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి గత ప్రభుత్వం కమీషన్లు దండు కుందన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, మం త్రుల దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గానికి ఎక్కువ నిధు లు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సుద్దాల, కమ్మరిపల్లి, తుర్కపల్లి గ్రామాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు సమస్యలను వెల్ల డించారు. మౌలిక సదుపాయాలతోపాటు అంతర్గత రహ దారులు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల ముందే బాహాబాహి అమృత్ 2.0 పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనుల్లో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొనగా వారి ఎదుటే భీమా రం-చెన్నూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాహా బాహికి దిగారు. భీమారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి రాగా అక్కడ ఉన్న జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి భీమారం నాయకులకు ఇక్కడ ఏమి అవసరమని గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వారితో మాట్లాడడంతో గొడవ సద్దుమణిగింది.